సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



గిరి గ్రామాల్లో పండగ సందడి

గిరిజన గ్రామాల్లో ఇటుకల పండగ సందడి నెలకొంది. శంకుదేవుడికి పూజలు చేసిన గిరిజనులు వేటకు ఆయుధాలు సిద్ధం చేశారు 8లో



పింఛన్ల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ 8లో

పింఛన్ల పంపిణీపై గ్రామీణాభివృద్ధి, ఆర్థికశాఖ అధికారులు వీడియో సమావేశం నిర్వహించారు.



ఐదేళ్ల ప్రయాణం.. ప్రజలతో మమేకం 9లో

ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

న్యూస్‌రీల్

ఎన్నికల ఏర్పాట్లపై అసంతృప్తి

- అధికారుల తీరుపై సాధారణ పరిశీలకుడు వివేకానందన్ ఆగ్రహం



అధికారులను హెచ్చరిస్తున్న వివేకానందన్

అరకులోయ రూరల్: ఎన్నికల ఏర్పాట్లు సవ్యంగా లేకపోవడంతో ఎన్నికల సాధారణ పరిశీలకుడు వివేకానందన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్ల పనులను పరిశీలించారు. తహసీల్దార్ సోమేశ్వరరావు, రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈవీఎంల పంపిణీకి సంబంధించి పూర్తి స్థాయిలో ఎందుకు ఏర్పాట్లు చేయలేదని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, సంబంధిత పనులను పరిశీలించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

నిబంధనలకు అనుగుణంగా విధులు

- లేకుంటే చర్యలు
- రంపచోడవరం ఆర్వో ప్రశాంతకుమార్



సూచనలిస్తున్న ఆర్వో ప్రశాంత్‌కుమార్

అడ్డతీగల: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతిఒక్క అధికారి విధులు నిర్వహించాలని రంపచోడవరం నియోజకవర్గ ఆర్వో సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆదేశించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్, బూత్ లెవెల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో రంగారావు పాల్గొన్నారు.

మోదమ్మ ఆలయానికి ఎయిర్ కూలర్ వితరణ



మోదకొండమ్మ ఆలయానికి ఎయిర్‌కూలర్‌ను అందజేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా దంపతులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఎస్పీ తుహిన్‌సిన్హా దంపతులు ఎయిర్ కూలర్‌ను ఆదివారం అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం,హెచ్‌ఎం దేశిది బాబురావు పాల్గొన్నారు.

420 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

జి.మాడుగుల: మైదాన ప్రాంతానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఆదివారం సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలో పాలమామిడి పంచాయతీ పెదపాడుకు చెందిన పాంగి పెద్దబ్బాయి, పాంగి శివయ్య, పాంగి సుబ్బారావు, పాంగి వెంకటరావు, పాంగి రాములు ఇళ్లకు సమీపంలోని పసుపుదొడ్డి వద్ద 420 కిలోల గంజాయిని సిద్ధం చేశారు. దీనిపై అందిన సమాచారం మేరకు వారిని ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశాని సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

డిపాజిట్ దక్కేనా?

- 2014లో అరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీతకు 4,13,191 ఓట్లు
- 2019లో జనజాగృతి పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా వచ్చిన ఓట్లు 1,158
- ఆ ఎన్నికల్లో నోటాకు పోలైనవి 16,646 ఓట్లు
- అతి తక్కువ ఓట్లతో ఆఖరి స్థానం
- ప్రస్తుతం అరకు ఎంపీ బీజేపీ అభ్యర్థిగా ఎదురీత



సాక్షి, విశాఖపట్నం: ఆమె పేరు కొత్తపల్లి గీత. 2014లో అరకు పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీగా గెలుపొందారు. అప్పట్లో ఆమెకు 4,13,191 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణిపై ఆమె 91,398 ఓట్ల మెజారిటీ సాధించారు. ఎంపీ అయిన కొన్నాళ్లకే ఆమె వైఎస్సార్‌సీపీని వీడారు. ఆపై 2018లో సొంతంగా జన జాగృతి పార్టీని స్థాపించారు. ఆ పార్టీ తరఫున 2019 ఎన్నికల్లో విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి బరిలో నిలిచారు. 2014లో అరకు నుంచి 4 లక్షలకు పైగా ఓట్లను, 90 వేలకు పైగా ఆధిక్యాన్ని సాధించిన ఆమె అదంతా తన బలంగా భావించారు. ఆ నమ్మకంతో 2019 ఎన్నికల్లో పోటీ చేసిన ఆమెకు తన సత్తా ఏపాటిదో తెలిసొచ్చింది. 2019 ఎన్నికలకు విశాఖ లోక్‌సభ నియోజకవర్గంలో 18,29,300 మంది ఓటర్లున్నారు. వీరిలో 12,39,754 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో కొత్తపల్లి గీతకు 1,158 మంది మాత్రమే ఓట్లు వేశారు. ఇది మొత్తం ఓట్లలో 0.09 శాతం మాత్రమే కావడం విశేషం. దీంతో ఆమె డిపాజిట్లు కోల్పోవడమే కాదు.. నోటాకు పడిన ఓట్లలో ఒక శాతం కూడా పొందలేక పోయారు. 2019 విశాఖ లోక్‌సభ స్థానానికి 14 మంది పోటీ చేశారు. వీరందరిలో ఆమె అత్యల్పంగా 1,158 ఓట్లు మాత్రమే సాధించి 13 వ స్థానంలో నిలిచారు. మిగిలిన 12 మంది ఆమెకంటే ఎక్కువ ఓట్లను సాధించిన వారే! వీరిలో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు 4,36,906 ఓట్లు లభించాయి. ఆ తర్వాత టీడీపీ అభ్యర్థి భరత్‌కు 4,32,492, జనసేన అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణకు 2,88,874, బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి 33,892, నోటాకు 16,646 ఓట్లు వచ్చాయి.

బలం తెలిసి.. బీజేపీలో చేరి..

2019 ఎన్నికల్లో ఘోర పరాజయంతో జనంలో తనకు వ్యక్తిగతంగా ఎంత బలముందో గీతకు తేటతెల్లమైంది. 2014లో వచ్చిన ఓట్లను చూసి తనను తాను అతిగా ఊహించుకున్న ఆమెకు అదంతా తన బలం కాదన్న వాస్తవం అర్థమైంది. దీంతో ఎన్నో ఆశలతో స్థాపించిన జన జాగృతి పార్టీకి మనుగడ లేదన్న నిర్ధారణకు వచ్చిన ఆమె ఆ పార్టీ చాప చుట్టేసి 2019 జూన్‌లో బీజేపీలో విలీనం చేశారు. తాను కూడా బీజేపీలో చేరిపోయారు.

అరకులో మరోసారి పరీక్ష

ఈసారి ఎన్నికల్లో కొత్తపల్లి గీత అరకు లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అరకు నుంచి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో కనీసం 1,200 ఓట్లు కూడా తెచ్చుకోలేని గీత ఈ ఎన్నికల్లో ఎలా విజయం సాధిస్తారోనని అరకు పార్లమెంటరీ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లా ఓటర్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. తొలిసారి ఎంపీగా పోటీ చేసి నాలుగు లక్షలకు పైగా ఓట్లతో గెలిచి.. ఆ తర్వాత ఎన్నికల్లో పోటీ చేసి వందల ఓట్లకు దిగజారిన అభ్యర్థి ఈమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నేడు చోడవరంలో సీఎం జగన్ ప్రచారభేరి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు

- ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తూరు జంక్షన్‌లో బహిరంగ సభ
- సభా ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ
- ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు సిద్ధం

సాక్షి, అనకాపల్లి : ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో చేపట్టిన సిద్ధం సభలు విజయవంతమయ్యాయి. ఈనెల 19 నుంచి ప్రారంభమై రెండు రోజుల పాటు జరిగిన మేమంతా బస్సుయాత్ర జన ప్రభంజనంలా సాగింది. ఈ నేపథ్యంలో ఈ నెల 29న సోమవారం చోడవరంలో ప్రచారభేరి మోగించడానికి రానున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు చోడవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు సిద్ధమయ్యారు. కొత్తూరు జంక్షన్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు తాజాగా విడుదల చేసిన నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో గురించి వివరించనున్నారు.

సభా ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి

సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ , జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గం పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు పరిశీలించారు. చోడవరం సమీపంలో జరుగుతున్న హెలి ప్యాడ్ పనులను పరిశీలించి సూచనలిచ్చారు.

భారీ బందోబస్తు..

సీఎం జగన్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నానికే పోలీసు బలగాలు చోడవరం చేరుకున్నాయి. సీఎం పర్యటన రూట్‌ను, బహిరంగ సభ స్థలాన్ని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. ఇటీవల సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో పాటు భారీగా పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించారు.

నేటి సీఎం పర్యటన ఇలా..

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఉదయం 8.45 గంటలకు తాడేపల్లిలో గల తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా 9.05 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 9.15 గంటలకు విమానమార్గంలో బయలుదేరి 10.05 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.35 గంటలకు చోడవరం చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.55 గంటలకు కొత్తూరు జంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభ వద్దకు చేరుకుంటారు. 11 గంటల నుంచి 11.45 గంటల వరకూ బహిరంగ సభ జరుగుతోంది. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో అంబేద్కర్ జిల్లాకు వెళతారు.

జగనన్నతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఎన్నికల మేనిఫెస్టోతో గిరిజన ప్రాంతానికి మేలు
- పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు



సాక్షి,పాడేరు: జగనన్నతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ,వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల ప్లస్ మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 2024 మేనిఫెస్టోతో గిరిజన ప్రాంతాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు, ప్రజలంతా 2019 ఎన్నికల మాదిరిగానే చంద్రబాబుకు ఈఎన్నికలలోను తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. జగనన్న అమ్మ ఒడి పెంపు వల్ల పిల్లలను బడికి పంపిన ప్రతి తల్లికి ఐదేళ్లలో రూ.85 వేల లబ్ధి చేకూరుతుందన్నారు. దీంతోపాటు వైఎస్సార్ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వల్ల మేలు జరుగుతుందన్నారు. ఐదేళ్ల పాలనలో జిల్లాను అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. దీనిలో భాగంగా పాడేరులో రూ.500కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గిరిజనులకు ఉన్నత వైద్యం,వైద్య విద్యను చేరువచేసిన సీఎంకు గిరిజనులమంతా రుణపడి ఉంటామన్నారు. ప్రతి నియోజకవర్గానికి స్కిల్ హబ్ సెంటర్ల ఏర్పాటుతో నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ,ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. నాణ్యమైన విద్యకు అన్ని పథకాలు కొనసాగుతాయని,రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు తమ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. చంద్రబాబు పాలనలో ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఈ ఎన్నికల్లో అయనకు ఓటుతో తగిన శాస్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోపై అన్ని గ్రామాల్లోను విస్తృత ప్రచారం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా మారెమ్మతల్లి పండగ



ప్రత్యేక అలకంరణలో అమ్మవారు

సీలేరు: మారెమ్మతల్లి ప్రధాన పండగ సీలేరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వీరి సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆలయ ప్రాంగణంలో విశాఖపట్నానికి చెందిన బాలాజి డిజిటల్ సర్వీసెస్‌కు చెందిన పోలన రాజు,మాలతి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

అందరికీ మేలు జరిగేలా మేనిఫెస్టో



మాట్లాడుతున్న అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ఉందని అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రస్తుతం చెల్లిస్తున్న జగనన్న అమ్మ ఒడి రూ.15 వేల నుంచి రూ. 17 వేలు, రైతు భరోసా రూ.13,500 నుంచి రూ.16 వేలు, వృద్ధుల పింఛను రూ.3 వేల నుంచి రూ.3,500కు పెంచుతామని ప్రకటించారన్నారు. సంక్షేమ పాలన అందించే జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు తనతోపాటు అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజా రాణిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులతో కలిసి మేనిఫెస్టో ప్రతులను ఆవిష్కరించారు. ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుస్మిత, జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ దురియా ఆనంద్ కుమార్, ముఖ్య నాయకులు కమిడి అశోక్, పల్టాసింగి విజయ్ కుమార్, పాంగి చిన్నారావు, ముఖీ సాంబయ్య, పట్టాసి సంపత్ కుమార్, గరం పూర్ణ, బాలరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రంప' టీడీపీలో కుమ్ములాటలు

- శిరీషా దేవికి టికెట్ కేటాయింపుతో గ్రూపులుగా విడిపోయిన శ్రేణులు
- టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి కొంత నగదు ఇవ్వాలని ప్రతిపాదన
- నేతల సమక్షంలో శిరీషాదేవి భర్త భాస్కర్ అంగీకరించినట్టు సమాచారం
- ఆ తరువాత ఇవ్వనని ప్రకటిస్తూ హెచ్చరించినట్టు వినికిడి
- ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జనసేన నేతలు

రంపచోడవరం: పార్టీ టికెట్ కేటాయింపు దగ్గర నుంచి రంపచోడవరం టీడీపీలో మొదలైన కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవిని అధిష్టానం ప్రకటించినప్పటి నుంచి పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి భంగపాటుకు గురయ్యారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తానని ఆమె అధిష్టానాన్ని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కొంత మంది నేతలు వంతల రాజేశ్వరి ఇంటి వద్ద సమావేశం ఏర్పాటుచేసి ఈ ఎన్నికల్లో శిరీషతో కలిసి కలిసి పనిచేసేందుకు ఆమెను ఒప్పించారు. దీనిలో భాగంగా వారిద్దరిని ప్రత్తిపాడు వచ్చిన చంద్రబాబు వద్దకు కూడా తీసుకువెళ్లి సయోధ్య కుదిర్చారు. అక్కడి నుంచి వచ్చిన తరువాత శిరీష, రాజేశ్వరితో నేతలు అంతర్గత సమావేశం నిర్వహించారు. వంతల రాజేశ్వరి ఐదేళ్ల పాటు టీడీపీ కోసం పనిచేశారని, చాలా డబ్బులు ఖర్చు పెట్టారని, ఆమెకు కొంత నగదు ఇవ్వాలని పార్టీకి చెందిన నాయకులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాస్, మీసాల రాజు ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇందుకు టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష, ఆమె భర్త మఠం భాస్కర్ అంగీకరించినట్టు సమాచారం. ఆ తరువాత నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'నా పని నేను చేసుకుంటానని, మీ అవసరం ఏమీ లేదని' శిరీషాదేవి భర్త భాస్కర్ వారిని హెచ్చరించినట్టు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి కూడా డబ్బులు ఇచ్చేది లేదని చెప్పినట్లు సమాచారం.ఇప్పటికే శిరీష నామినేషన్ సమయంలో అయిన ఖర్చుకు సంబంధించి డబ్బులు ఇవ్వలేదన్న కారణం చూపిస్తూ జనసేన నేతలు శిరీషాదేవి కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ప్రచారాలకు అయ్యే ఖర్చును ఇస్తేనే తాము పాల్గొంటామని ఇప్పటికే వారు స్పష్టం చేసినట్టు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఒక్క పక్క సొంత పార్టీలో మద్దతు సరిగా లేకపోవడం ,కూటమిలోని జనసేన నాయకులు కలిసి రాకపోవడంతో టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషకు ఎదురీత తప్పడం లేదు.

గాలివాన బీభత్సం 8లో

మెకానిక్ దారుణ హత్య

- నిద్రిస్తుండగా కత్తితో విచక్షణారహితంగా దాడి
- తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



సోభ హేమరాజు మృతదేహం (ఇన్‌సెట్) పాత చిత్రం

పెదబయలు: మండల కేంద్రం పెదబయలులో మెకానిక్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాడేరు మండల నక్కలపుట్టు గ్రామ పంచాయతీ పరిధి వంతాడపల్లికి చెందిన సోభ హేమరాజు (33), భార్య పిల్లలతో కలిసి బంధువైన మండలంలోని సీతగుంట మాజీ సర్పంచ్ తైసాబు త్రినాథ్ కుమారుడు వివాహానికి వచ్చాడు. శనివారం రాత్రి పెళ్లి ఇంట్లో భోజనం చేసి మాజీ సర్పంచ్ తమ్ముడు తైసాబు ఈశ్వరరావు ఇంటి డాబాపై పడుకున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మండలంలోని సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు గ్రామానికి చెందిన పల్లుల సుందర్‌రావు అతనిపై కత్తితో దాడి చేశాడు. తల, ముఖం, మెడ, చేతులపై విచక్షణరహితంగా నరికేశాడు. పక్కనే ఉన్న పిల్లలు కేకలు వేయడంతో బంధువులంతా డాబాపైకి వెళ్లారు. తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉన్న అతనిని పాడేరు జిల్లా ఆస్పత్రికి వారు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే చనిపోయాడు. ఈమేరకు భార్య సరోజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు.

వివాహేతర సంబంధమే కారణమా..?

మృతుడు హేమరాజు పాడేరులో సుజికి షోరూంలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం నుంచి భర్త హేమరాజు, సుందర్‌రావు గొడవ పడుతున్నారని.. అదే కక్షతో అన్యాయంగా కత్తితో నరికి చంపేశాడని మృతుని భార్య సరోజిని కన్నీటిపర్యంతమైంది. ఇద్దరి మధ్య గొడవకు వివాహేతర సంబంధం కారణం కావొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో వారు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడు సుందర్‌రావు పరారీలో ఉన్నాడని, అతనికోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇలావుండగా మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సరోజిని హుకుంపేట మండలంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్నారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం



దొన్నుదొర ముఖ్య అనుచరుడు కిల్లో జగన్‌ను ఆహ్వానిస్తున్న మత్స్యలింగం



చంపగుడలో టీడీపీ కుటుంబాలను ఆహ్వానిస్తున్న రేగం మత్స్యలింగం

- అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం
- టీడీపీ నేత దొన్నుదొర అనుచరులు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానం

అరకులోయ రూరల్: ఇక్కపై టీడీపీ భూస్థాపితమవడం ఖాయమని వైఎస్సార్ సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు, టీడీపీ అరకు ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ముఖ్య అనుచరుడు కిల్లో జగన్, ఆ పార్టీకి చెందిన మరో 50 మంది ఆదివారం మత్స్యలింగం నివాసం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిల్లో జగన్ మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న మోసాలను చూసి విసిగిపోయామన్నారు. అందువల్లనే ఆ పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. ఇన్నాళ్లు మనసు చంపుకుని ఆ పార్టీలో కొనసాగామన్నారు. జగనన్న ప్రభుత్వం మాదిరిగా సంక్షేమ పథకలు అందించలేదని పార్టీలకు అతీతంగా ఏ ప్రభుత్వం అందించలేదన్నారు.

జగనన్న సుపరిపాలనకు ఆకర్షితులమై..

జగనన్న సుపరిపాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని మండలంలో మాడగడ మేజర్ పంచాయితీ చంపగుడలో టీడీపీకి చెందిన వంద కుటుంబాలు తెలిపాయి. ఆదివారం ఆ గ్రామంలో పర్యటించిన అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు, పార్టీలో చేరిన గ్రామ పెద్దలు వంతల పండు తదితరులు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు అర్హతే ప్రామాణికంగా అందించడం అభినందనీయమన్నారు. ఆయన పాలన ఎంతగానో తమకు నచ్చిందని అందువల్లనే పార్టీని వీడామని వారు పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే మన్యం అభివృద్ధి



తూరుమామిడిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు కురుసా పార్వతమ్మ, నేతలు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారా గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కురుసా పార్వతమ్మ అన్నారు.మండలంలోని మారుమూల డల్లాపల్లి, తూరుమామిడి, బురదపాడు, బురుగుచెట్టు గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్వతమ్మతో పాటు నాయకులంతా ఇంటింటా వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజును అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గల్లొంగి లక్ష్మికొండమ్మ, నాయకుడు ముదిలి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- ముంచంగిపుట్టు మండలంలో రోడ్డుకడ్డంగా కూలిన చెట్లు
- జంగంసరియాలో దెబ్బతిన్న ఇంటి పైకప్పు



ముంచంగిపుట్టులో పెళ్లి వేడుక వద్ద పడిపోయిన టెంట్



ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయిన బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

ముంచంగిపుట్టు: మండలంలో గాలి, వాన బీభత్సం సృష్టించాయి. ఉదయం అంతా విపరీతమైన ఎండ కాస్తూ మధ్యాహ్నం అయ్యే సరికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. భారీ ఈదురు గాలులతో వర్షం కురిసింది. మండల కేంద్రంలో వివాహ వేడుకకు సంబంధించి ఏర్పాటుచేసిన టెంట్ పడిపోవడంతో అక్కడ ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. లుంగాపుట్టు, వనభసింగి, కిలగాడ ఘాట్ ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సాయంతో వాహనదారులు రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రాకపోకలు సాగించారు. ఏనుగురాయి పంచాయతీ జంగంసరియాలో పెనుగాలులకు కిల్లో నిండి అనే గిరిజనుడి ఇంటి పైకప్పు రేకులు సగం మేర ఎగిరిపోయాయి. స్థానిక ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి గ్రామానికి వెళ్లి బాధితుడు నిందిని పరామర్శించారు. దెబ్బతిన్న ఇంటి పైకప్పును పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని ఆమె భరోసా ఇచ్చారు.

జి.మాడుగుల: మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, సాలభం రోడ్డు మార్గాల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కుంబిడిసింగి, సంగం గెడ్డలు వర్షపు నీటితో పొంగి ప్రవహించాయి.

‘సాక్షి’ మాక్ ఈఏపీసెట్‌కు విశేష స్పందన

తగరపువలస: సాక్షి మీడియా గ్రూప్, ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయం సంయుక్తంగా శని, ఆదివారాల్లో నిర్వహించిన సాక్షి మాక్ ఏపీఈఏపీసెట్–2024కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీకి చెందిన ల్యాబ్‌ల్లో ఆన్‌లైన్‌లో జరిగిన సాక్షి మాక్ టెస్టులో శ్రీ చైతన్య, శ్రీవిశ్వ తదితర విద్యాసంస్థల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ టెస్టు వల్ల తాము ఎంత వరకు చదువుకున్నాం.. ఏఏ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి.. ఏ ప్రశ్నలకు ముందుగా జవాబు రాయాలి.. పరీక్షను ఎదుర్కొనే విధానం.. సమయపాలన వంటి అంశాలపై అవగాహన కలిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పరీక్షను ఎస్ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, పర్యవేక్షకులు చందు, శ్రీ చైతన్య, శ్రీ విశ్వ ప్రతినిధులు సురేష్, పి.సూర్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.



వివిధ ల్యాబ్‌లలో ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ఆందోళన దూరమైంది



ఏపీఈఏపీసెట్ మాక్ పరీక్ష రాయడం వల్ల నాలో ఆందోళన దూరమైంది. సహజంగా ఆన్‌లైన్ పరీక్షలు ఎదుర్కొనే విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. ఈ పరీక్ష కారణంగా ఒత్తిడి నుంచి దూరం కావడం ఎలాగో కిటుకు తెలిసింది. ఇప్పుడు మెయిన్ పరీక్షను ఉత్సాహంగా ఎదుర్కొంటా.

– ఎం.యామిని, ఎలమంచిలి

పరీక్షపై అవగాహన పెరిగింది



ఏపీఈఏపీసెట్ రాసే విధానంపై పూర్తిగా అవగాహన కలిగింది. మాక్ టెస్ట్ నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్, ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయం వారికి ధన్యవాదాలు. పరీక్షలో ఆందోళన చెందకుండా నాలాంటి విద్యార్థులకు ఇలాంటి మాక్ టెస్టులు దోహదపడతాయి.

– బి.చరణ్, మాడుగుల

సమయపాలనపై అవగాహన



ఏపీఈఏపీసెట్ మాక్ పరీక్ష రాయడం వల్ల సమయపాలనపై అవగాహన పెరిగింది. ఏ విభాగానికి ఎంత సమయం కేటాయించాలో తెలిసింది. ఇలాంటి పరీక్షలు తరచూ అన్ని పోటీ పరీక్షలకు నిర్వహిస్తే బాగుంటుంది. నిర్వాహకులకు కృతజ్ఞతలు.

– ఎం.జోషిక, సబ్బవరం

ఎంతో వ్యత్యాసం కనిపించింది



ఇంటర్మీడియట్‌లో నాకు మంచి మార్కులే వచ్చాయి. ఏపీ ఈఏపీసెట్‌కు ప్రిపేరవుతూ ఎన్నో మోడల్ పేపర్లు ఆన్సర్ చేశాను. సాక్షి మాక్ టెస్టు చాలా డిఫరెంట్‌గా ఉంది. సిలబస్ పార్టు బాగా కవర్ చేశారు.

– ఎ.హర్షిత, కోల్‌కత్తా

కొండంత ధీమా కలిగింది..



మాక్ టెస్ట్ నిర్వహణ చాలా బాగుంది. ఈ పరీక్ష రాయడం వల్ల నాలో కొండంత ధీమా కలిగింది. ఇప్పుడు ఏపీఈఏపీసెట్‌ను ఎదుర్కోగలను. మంచి ర్యాంకు సాధించగలనని భరోసా ఏర్పడింది.

– ఆర్.రోషిణి, విజయనగరం

మంచి తోడ్పాటు



ఏపీఈఏపీసెట్‌ను ధైర్యంగా ఎదుర్కోగల సత్తా సాక్షి మాక్ టెస్టు ద్వారా లభించింది. నాలాంటి ఎందరో విద్యార్థులకు వీలుగా మాక్ టెస్ట్ నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు. పరీక్ష ఎలా ఉంటుందో ముందే తెలుసుకోగలం.

– పి.రవిశంకర్, బొబ్బిలి

మంచి మార్కులకు సూచిక



మాక్ టెస్టు బాగా రాశాను. దీనిని బట్టి నేను ఇంకా మంచి మార్కులు సాధించుకోవడానికి ఏం చేయాలో తెలిసింది. మ్యాథ్స్ 2బీ ఇంకా ప్రిపేర్ కావడానికి సూచికగా ఈ టెస్టు ఉపయోగపడింది.

– బి.జలంధర్, తుని

సన్నద్ధతకు సరైన మార్గదర్శి



నేను ఏపీఈఏపీసెట్‌కు కష్టపడి ప్రిపేర్ అవుతున్నాను. సాక్షి మాక్ టెస్టు వల్ల నేను ప్రిపేర్ అయిన సిలబస్ చెక్ చేసుకోవడానికి ఉపయుక్తంగా నిలిచింది. మంచి ర్యాంకు సాధించగలననే నమ్మకం వచ్చింది.

– ఎం.వెన్నెల, బొబ్బిలి

ప్రశ్నాపత్రం రూపకల్పన బాగుంది



సాక్షి మాక్ టెస్టుకు రూపొందించిన ప్రశ్నాపత్రం రూపకల్పన బాగుంది. వచ్చే నెలలో జరగనున్న ఏపీఈఏపీసెట్‌కు ఇవే ప్రశ్నలు వస్తాయా అనేలా ఉంది. ఏఏ సబ్జెక్టుల నుంచి ఏఏ ప్రశ్నలు వస్తాయో నిశితంగా పరిశీలించి సెట్ చేసినట్టు ఉంది.

– ఎం.వి.ఎస్.జ్యోత్స్న, విజయనగరం

మాకెంతో మేలు..



సాక్షి మాక్ టెస్టు ద్వారా ఏపీ ఈఏపీసెట్ పరీక్ష విధానం ముందుగానే తెలిసింది. మిగిలిన రోజులు మరింతగా సబ్జెక్టుపై పట్టు సాధించడానికి, ఉత్తమ ర్యాంక్ సాధించడానికి మాక్‌టెస్ట్ ఎంత గానో ఉపయోగపడింది.

– డి.జాహ్నవి, సోంపేట

పింఛన్ల పంపిణీపై వీడియో కాన్ఫరెన్సు

సాక్షి,పాడేరు: మే నెలకు సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రావత్‌లు ఆదివారం వీడియో సమావేశం నిర్వహించారు. పింఛనుదారులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా పంపిణీ చేయాలని వారు సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఎం.విజయ సునీత, డీఆర్‌డీఏ పీడీ మురళీ పాల్గొన్నారు.

పంపిణీకి ఏర్పాట్లు: కలెక్టర్ విజయ సునీత

జిల్లాలో 1,27,894 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వీరందరికీ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత నెలలో కూడా 99.18శాతం పింఛన్ల పంపిణీని సకాలంలో పూర్తిచేసి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచామన్నారు. అదే స్ఫూర్తితో మే నెల పింఛన్ల పంపిణీని చేపట్టాలని ఎంపీడీవోలు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలిచ్చామని కలెక్టర్ తెలిపారు.

గిరి గ్రామాల్లో పండగ సందడి



చోటముఖిపుట్టులో కావిడకు ప్రత్యేక పూజలు చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలోని గిరిజన గ్రామాల్లో ఇటుకల పండగ సందడి నెలకొంది. దీనిలో భాగంగా చోటముఖిపుట్టు, కొండపడ, ఏనుగురాయి, ధారపల్లి, జెర్రెల తది తర గ్రామాల్లో ఆదివారం శంకుదేవుడికి పూజలు చేశారు. గ్రామ చావిడిల వద్ద గధ రూపంలో గొడుగు, జెండాలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. అడవి జంతువుల వేటకు వెళ్లేందుకు ఈటెలు, బల్లాలు, బాణాలకు పూజలు చేశారు. రాత్రిపూట థింసా నృత్యాలు చేస్తూ సందడి చేస్తున్నారు.మహిళలు గ్రామాల్లోకి వచ్చే వారి నుంచి తాచేరు వసూలు చేస్తున్నారు. వారం రోజులు పాటు పండగ సందడి ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఏపీసెట్‌కు విశాఖలో 79.25 శాతం హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఏపీసెట్–2024కు విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలో 79.25 శాతం హాజరు నమోదైంది. విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలో 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 9311 అభ్యర్థులు దరఖాస్తు చేయగా.. 7379 మంది హాజరయ్యారు. పరీక్షకు 1932 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏపీసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య జి.ఎం.జె.రాజు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ఆదివారం ఉదయం సందర్శించారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం



నగనూరలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు



దోనెలపాలెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను గెలిపించుకుందామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. పేదల పెన్నిధి మన జగనన్నను గెలిపించుకొంటే ప్రతి అక్క చెల్లి, అమ్మ ఇంట వెలుగుల పంటే అన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ధనలక్ష్మి ఆదివారం రాజవొమ్మంగి మండలంలోని వెలగలపాలెం, రేవటిపాలెం, దోనెలపాలెం, సింగంపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నన్ను మీ ఇంటి ఆడబడుచుగా ఎంతో ఆదరించారని, పదవిలోకి వచ్చింది మొదలు మీ గడపగడపకు వస్తునే వున్నానని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని రావడం కాదు, మీ సమస్యల పరిష్కారానికి నిత్యం నావంతు కృషి చేసానని కరతాళధ్వనుల మధ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ గ్రామాలకు వచ్చిన ధనలక్ష్మికి గిరిజన మహిళలు పూలు జల్లుతు, హారతులు పట్టి, బొట్టు పెట్టి స్వాగతం పలికారు. జగనన్న ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతమన్నారు. పేదలకు మరింత ప్రయోజనం చేకూర్చే విధంగా ఉందన్నారు. . వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు దేశానికే ఆదర్శమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం, రేషన్ కార్డులు, ఏ సంక్షేమ పథకం కావాలన్నా కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరుగాల్సివచ్చేదన్నారు. ప్రజలను మళ్లీ దోచుకొనేందుకు చంద్రబాబు, అనుయాయులు ఎదురు చూస్తున్నారని హెచ్చరించారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దని హితవు పలికారు. ఒక్కపైసా అవినీతి లేకుండా ఈ పథకాలన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్న వాస్తవాన్ని మరువవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్న పాలన ఐదేళ్లలో అన్ని వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. రెండేళ్ల కరోనా కష్టాలను జగనన్న ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకున్న విషయం మీకందరికీ తెలుసునన్నారు. రానున్న రోజుల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి కోసం జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం అని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణిని, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ధనలక్ష్మి అనే తనను భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు.

మండల పార్టీ అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేశ్వరరాజు, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, దాసరి నాగేశ్వరరావు, సవిరెల చంద్రుడు, మిరియాల గణలక్ష్మి, సత్యవతి, గంగవరం జెడ్పీటీసీ బేబీ రత్నం, నాయకులు శాంతకుమారి, కామేష్, రవి, కుశరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసి, మరింత అభివృద్ధి సాధించి, మరిన్ని సంక్షేమ పథకాలు పొందుదామని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని శనగనూరు, పులుసుమామిడి, పాతకోట, ఊట్ల బంద, కానివాడ తదితర గ్రామాల్లో ఆయన అదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనకు ప్రతీ గ్రామంలో ఘణ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పని జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం చేశారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. చంద్రబాబుది ధనికులకు అనుకూలమైన ప్రభుత్వమని, జగనన్నది పేదప్రజల ప్రభుత్వమని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ కోసం నానా అవస్థలు పడేవారని, జన్మభూమి కమిటీలు, పాలకులు సొమ్మును కాజేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం జగనన్న పాలనలో సచివాలయ, గ్రామవలంటీరు వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. లబ్ధిదారుని ఖాతాకే సంక్షేమ పథకాల సొమ్మును జమచేస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వహ యాంలో మండలానికి లబ్ధి చేకూర్చిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. చంద్రబాబు చేస్తున్న కుట్రలు కుతంత్రాలతో వలంటీర్లకు విధుల నుంచి తొలగించడంతో పింఛన్ల కోసం దివ్యాంగులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. మరింత సంక్షేమం కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సాదాల లక్ష్మి, సర్పంచ్‌లు, నాయకులు గుడ్ల త్రిమూర్తులు, నారాయణరావు, విజయ్‌కుమార్, భారతిబాబు, మడి బాబి, రమేష్, కనకరాజు, తిరుపతిరెడ్డి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): గిరి గ్రామాలు మరింత అభివృద్ధి సాధించాలంటే వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ గుమ్మ తనూజరాణి, రేగం మత్స్యలింగం అన్నారు. ఆదివారం మండలంలోని కొర్రా, కించుమండ, కితలంగి పంచాయతీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడారు. గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. జగనన్న ఐదేళ్ల పాలనలో మన్యంలో ఊహించని అభివృద్ధి, గిరిజనుల ఆర్థిక స్థితిగతులు మారాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని, ప్రధానంగా పేదలకు మరింత మేలు చేకూర్చే విధంగా రూపొందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా తమను గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు.

ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స అందించిన ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి

మండలంలోని కంద్రూం పంచాయతీకి చెందిన పాంగి లచ్చన్న ద్విచక్ర వాహనం నుంచి ప్రమాదవశాత్తు పడిపోవడంతో అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజరాణి తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం డుంబ్రిగుడ ఆస్పత్రికి తరలించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ, ఎంపీపీ బాక ఈశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్యేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, పంచాడి లలిత, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిమ్ముడు హరి, సర్పంచ్‌లు అర్జున్, జాన్ విన్సెంట్, కె.సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు విజయ్, శోభదేవి, నాయకులు గణపతి, రఘుపతి, బాలరాజు, చిరంజీవి, శాంతి, లీలరాణి, బాక సింహాచలం, శ్రీరాములు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జాతీయ క్రికెటర్ కమలాకర్



సీతమ్మధార(విశాఖ ఉత్తర): కాంగ్రెస్ పార్టీలో తనకు అవమానం జరగడంతో ఆ పార్టీ కి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ఉత్తర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, జాతీయ క్రికెట్ ఆటగాడు కమలాకర్ తెలిపారు. ఆదివారం గురుద్వార్ దరి ఓ గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర కాంగ్రెస్ టికెట్ తనకు కాకుండా గాజువాకకు చెందిన వ్యక్తికి ఇవ్వడంతో అవమానం తట్టుకోలేక రాజీనామా చేసి సోమవారం వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. కేకేరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేకేరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తాపడిన కారు

మారేడుమిల్లి : మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. కాకినాడ నుంచి నలుగురు వ్యక్తులు కారులో మారేడుమిల్లికి విహారయాత్రకు వచ్చారు. ఇక్కడి ప్రదేశాలను తిలకించడానికి ఘాట్ రోడ్డుకు వెళ్తుండగా జలతరంగిణీ జలపాతం వద్ద మలుపులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న తుప్పులోకి దూసు కుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారి పూర్తి వివరాలు తెలియరాలేదు.